

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్





నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

శనివారం, ఏప్రిల్ 4, 2026 పేజీలు:6


## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఇందిరమ్మ

# ఇండ్ల అభివృద్ధి

### తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ టూరిజం పర్యటక పురావత్ సంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్ ఏప్రిల్ 3 ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో అర్హులైన ప్రతి ఒక్క రికి సొంతింటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సొంత జాగా ఉండి అర్హులైన వారికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 5లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది.

ఈ పథకంలో భాగంగా ఇప్పటికే లక్షకుపైగా ఇళ్లు గృహప్రవేశాలు పూర్తి అయ్యాయి. చాలా ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. అయితే, జూన్ నాటికి మరో లక్ష ఇళ్లను పూర్తి చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతు న్నాయి. ఈ క్రమంలోనే



## క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే

# కఠిన చర్యలు

### నారాయణ పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి)** ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో, కొంత మంది యువత తక్కువ సమయంలో, సులువుగా డబ్బులు సంపాదించాలని ఆశించి క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా నష్టపోయి, జీవితాలు నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం కూడా ఉందని,




## రేషన్ షాపుల్లో.. నాణ్యత

# ప్రమాణాలు పాటించాలి

### -రెండవ వార్డులో నూతన రేషన్ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ



## ఎస్ఐఆర్‌లో గద్వాల జిల్లా

# భారీ పురోగతి

### -21వ,స్థానం నుంచి 3వ,స్థానానికి ఎదుగుదల



**గద్వాల ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో జిల్లా విశేషమైన పురోగతిని సాధించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, ఇటీవల

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఇందిరమ్మ

# ఇండ్ల అభివృద్ధి

ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.
ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో స్థలాల లభ్యత ఉన్నచోట ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారులకోసం స్టిల్ట్‌9, స్టిల్ట్‌5, జీం3 అంతస్తుల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించాల ని గృహనిర్మాణ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. సుమారు 415 నుంచి 500 చదరపు అదుగుల మధ్యలో రెండు పడకల గదుల ఇళ్లు ఉండేలా ఆకృ తులను రూపొందించను న్నారు. ఇందుకోసం ఇప్ప టికే హైదరాబాద్ పరిధిలో ఐదు మురికి వాడలను. వాంబే, ఈడబ్ల్యూఎస్ పథకాల కింద నిర్మించి శిథిలావస్థకు చేరిన మరో 12 కాలనీలను అధికారు లు గుర్తించారు.
స్టిల్ట్ పద్ధతిలో నిర్మించే బహుళ అంతస్తుల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లలో గదులు ఉండవు. ఇక్కడ వాహనాల పార్కింగ్, వాణిజ్య సముదాయాల గదులను నిర్మిస్తారు. జీప్లస్3 విధానంలో మాత్రం గ్రౌండ్ ఫ్లోర్‌లో గదులను నిర్మించి ఇస్తారు. ఎకరానికి స్టిల్ట్ ప్లస్ 9 అంతస్తుల్లో 200 నుంచి 220 ప్లాట్లు, స్టిల్ట్ ప్లస్ 5 అంతస్తుల్లో 150 నుంచి 200 ప్లాట్లు, జీప్లస్3 విధానంలో 120 నుంచి 150 ప్లాట్లు నిర్మించ డానికి సాధ్యమవుతోంది.
హైదరాబాద్ నగరంతో పాటు హైదరాబాద్ శివారు జిల్లాలైన మేడ్చల్ జిల్లాలో 28 ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో ఇక్రిశాట్ వద్ద ఐదు ఎకరాలు, మార్క్స నగర్ లో ఆరు ఎకరాల్లో, లక్డారంలో 130 ఎకరాల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోం ది. అంతేకాక.. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, అదిలా బాద్ జిల్లా కేంద్రాల్లోసైతం స్టిల్ట్ పద్ధతిలో ఇళ్లను నిర్మించి అర్హులైన పేదలకు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## ఎస్ఐఆర్‌లో గద్వాల జిల్లా

# భారీ పురోగతి

చేపట్టిన స్పష్టమైన కార్యాచరణ,సమర్థవంతమైన పర్యవేక్షణ ఫలితంగానే ఈ విజయాన్ని సాధించామని పేర్కొన్నారు.వ్యవస్థలో ఉన్న లోపాలను సమగ్రంగా గుర్తించి,వాటిని వేగంగా సరిదిద్దేందుకు జిల్లా అధికార యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా ఎస్ఐఆర్‌లో జిల్లా 21వ స్థానం నుంచి మూడవ స్థానానికి చేరుకున్నట్లు వివరించారు. సూపర్వైజర్లు,బూత్ లెవెల్ అధికారులపై పర్యవేక్షణ పెంచడంతో ఎస్ఐఆర్ పురోగతి శాతం 63 నుంచి 74 శాతానికి పెరిగిందని తెలిపారు.ఫలితంగా 27-02-2026 నాటికి రాష్ట్ర స్థాయిలో 21వ స్థానంలో ఉన్న జిల్లా,31-03-2026 నాటికి మూడవ స్థానానికి చేరుకుందని చెప్పారు.తక్కువ సమయంలో సాధించిన ఈ పురోగతి విశేషమని కలెక్టర్ పేర్కొన్నారు.నిరంతర సమీక్షలు,సమయపాలనతో కూడిన కార్యాచరణ ఈ విజయానికి కీలకంగా నిలిచాయని తెలిపారు.బూత్ స్థాయి అధికారులు,మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం,రాజకీయ ప్రతినిధులు,సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేయడం ద్వారా సమన్వయం పెరిగి పారదర్శకతతో ముందుకెళ్లినట్లు వివరించారు.మొత్తం పరిపాలనా బృందం సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని,ఇదే క్రమశిక్షణ,సమన్వయం భవిష్యత్తులోనూ కొనసాగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.రాబోయే ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని ఇదే విధమైన కట్టుదిట్టమైన కార్యాచరణ కొనసాగించి,త్వరలోనే రాష్ట్రంలో మొదటి స్థానానికి చేరుకునేలా కృషి చేయాలని అధికారులకు,సిబ్బందికి కలెక్టర్ పిలుపునిచ్చారు.

## రేషన్ షాపుల్లో.. నాణ్యత

# ప్రమాణాలు పాటించాలి

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దారిద్రపు రేఖకు దిగువున జీవిస్తున్న.. పేద మధ్య ప్రజల కొరకు, పంపిణీ చేస్తున్న పిడిఎస్ బియ్యంలో అవకతవకలు జరపకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి, పేద ప్రజలకు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో ఒకే గొడుగు కిందాల.. రేషన్ డీలర్లు తమ ఇష్టానుసారంగా.. పాత బజార్లో ఏర్పాటు చేసుకొని, ఇటు లబ్ధిదారులకు అటు వాహనదారులకు ఇబ్బందికరంగా మారడం ద్వారా సమస్యను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే వంశీకృష్ణ సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి.. రేషన్ షాప్ ను అవార్డులోనే ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని ఆదేశించడం గతంలో జరిగింది. ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు రేషన్ షాపులను ఆ కాలనీలో ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై, సాయి నగర్ కాలనీలోని రెండో వార్డులో నూతన రేషన్ షాపును మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, తాసిల్దార్ సైదులు, కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని రేషన్ డీలర్లు లబ్ధిదారులకు ప్రతిరోజు అందుబాటులో ఉండి ప్రభుత్వ పరంగా అందించే ఉచిత రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, తాసిల్దార్ సైదులు, కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్, డీలర్లు కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు తదితరులు ఉన్నారు

## ఆగ్ని కీలల్లో నల్లమల అడవి



అమ్రాబాద్, ఏప్రిల్ 3 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లో అగ్ని ప్రమాదం కలకలం రేపుతోంది. మన్ననూర్ రేంజ్ పరిధిలోని ఫర్హాబాద్ సమీపంలో శ్రీశైలం ప్రధాన రహదారిపై కిమీ మేర అగ్గి ఎగసి పడుతుంది. ఒక పక్క అడవిలో సలేశ్వరం జాతరకు వెళ్ళిన భక్తులు అధిక సంఖ్యలో ఉండగా అగ్ని ప్రమాదం కలవరపరుస్తుంది. సింగిడి గుండాల, గుండం, తాటి గుండాల, జిల్గాయి కుంట, ఫర్హాబాద్ న్యూ రోడ్ వెంట అడవి అగ్గికి ఆహుతౌతుంది . మంటలను ఆర్పేందుకు ఫారెస్ట్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సుమారు మూడు హెక్టార్ల మేర అడవి ఆహుతై ఉంటుందని ఫారెస్ట్ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఒక పక్క సలేశ్వరం జాతరకు వచ్చిన భక్తులతో పాటు అడవి జంతువులు అల్లకల్లోలం అవుతున్నాయి.





## క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే

# కఠిన చర్యలు

దీంతో కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు.
క్రికెట్ బెట్టింగ్స్ చట్టరీత్యా నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. అలాగే బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
యువత ఈ మాయలో పడకుండా జాగ్రత్తపడాలని, తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని ఎస్పీ గారు సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్‌ల సమయంలో పిల్లల్లో ఏవైనా అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.
క్రికెట్ వంటి ఆటలను వినోదంగా మాత్రమే చూడాలని, వాటిని బెట్టింగ్‌ల కోసం ఉపయోగించకూడదని అన్నారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.





# అన్నపూర్ణ ఫైనాన్స్ ఉదారత

**-నిరుపేద కుటుంబానికి రూ. 50 వేల రుణ మాఫీ**



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 03( ప్రజా జ్యోతి)** దామరగిద్ద ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవడంలో అన్నపూర్ణ ఫైనాన్స్ సంస్థ మానవత్వాన్ని చాటుకుంది. అన్నాసాగర్ గ్రామానికి చెందిన టి. పద్మమ్మ సెప్టెంబర్ నెలలో తన ఉపాధి అవసరాల కోసం అన్నపూర్ణ ఫైనాన్స్‌లో 50,000 రూపాయల రుణం తీసుకున్నారు. మూడు వాయిదాలు సక్రమంగా చెల్లించిన అనంతరం, జనవరిలో ఆమె భర్త ఆకస్మికంగా మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితురాలి పరిస్థితిని గమనించిన సంస్థ మేనేజర్ మ్యకలి శ్రీనివాస్, డి.ఓ. ఆంజనేయులు సానుకూలంగా స్పందించి, పద్మమ్మ తీసుకున్న 50,000 రూపాయల రుణాన్ని పూర్తిగా మాఫీ చేశారు.అంతేకాకుండా, సంస్థ నిబంధనల ప్రకారం ఆమెకు తిరిగి రావాల్సిన ఈఏంఐ రూ. 6,975 నగదును శుక్రవారం రోజు 5వ వార్డు మెంబర్ పరబ్రహ్మం సమక్షంలో ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఫైనాన్స్ మేనేజర్ మరియు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధి లేని వారికి రుణ సౌకర్యం కల్పించడంతో పాటు, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలవడం గొప్ప విషయమని కొనియాడారు. బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలు మరిన్ని సేవా పథకాలతో ముందుకు వచ్చి నిరుపేదలను ఆదుకోవాలని వారు ఆకాంక్షించారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన సంస్థ ప్రతినిధులకు అన్ని విధాలుగా సహకరించిన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మోహన్ రాజ్ కు పద్మమ్మ కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం





**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి)** నారాయణ పేట జిల్లా జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టరేట్ ఏవో శ్రీధర్ బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీ ఆర్ వో రషీద్ లతో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఏ వో శ్రీధర్ మాట్లాడుతూదొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ..ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీ.సీ సంక్షేమ శాఖ వసతి గృహాల వార్డెన్లు రేణుక, మంజుల, జ్యోతి, అన్వేష్ ,ముస్తఫా, శివ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదం కార్పొరేట్ శక్తుల నుండి దేశానికి విముక్తి కల్పించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్**






**కొల్లాపూర్ ఏప్రిల్ 3 ప్రజా జ్యోతి** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ మతోన్మాదం, కార్పొరేట్ శక్తులు భారతదేశాన్ని ఏలుతున్నాయని ఆ కబంధ హస్తాల నుండి భారతదేశానికి విముక్తి కల్పించాలని నాగర్ కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ ఎం డి ఫయాజ్ అన్నారు పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామం సిపిఐ కార్యదర్శి సంఘం కృష్ణ అధ్యక్షతన ఇంటింటికి సిపిఐ గడపగడపకు సిపిఐ కార్యక్రమాన్ని నాగర్ కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ప్రజా సమస్యల పరిష్కరించడంలో సిపిఐ పార్టీ 100 సంవత్సరాల నుంచి పోరాడుతూనే ఉందన్నారు. సమ సమాజ స్థాపనకై రాజీలేని పోరాటాలు చేస్తూ కార్మిక రైతు మహిళా విద్యార్థి యువజన తదితర ప్రజాసంఘాల నిర్మించిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. దున్నే వాడికి భూమి కావాలి భూ సంస్కరణల కోసం ఈరోజుతో పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐ పార్టీ దే అన్నారు. విద్య ప్రవేటీకరణ, ఉద్యోగ అవకాశాలను కల్పించకుండా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తూ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో గద్దెదించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ ప్రజానాట్యమండలి నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి, పెబ్బేటి విజయుడు, పెద్దకొత్తపల్లి మండల్ సిపిఐ సహాయ కార్యదర్శి ఎం లక్ష్మీనారాయణ గ్రామ కార్యదర్శి సంఘం కృష్ణ, సహాయ కార్యదర్శి ఆర్య శివ,సిపిఐ పార్టీ నాయకులు చింతలపల్లి కురుమయ్య, ప్రకాష్, హరికృష్ణ, రామకృష్ణ,శివకుమార్, తదితరులు పాల్గొన్నారు

# శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం కార్యక్రమం



**గండిడ్(ప్రజా జ్యోతి)** సాలార్ నగర్ గ్రామంలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం రుద్రాభిషేకం నిర్వహించబడుతుంది. అనంతరం ఆంజనేయ స్వామికి చందూరం కార్యక్రమం జరుగుతుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం బొడ్రాయి నాభి శిల చుట్టూ బోనాల మహా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ వేడుకలకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. గ్రామంలో ఉత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

# సంగమేశ్వర శివయ్య స్వామిని దర్శనం

**లైఫ్ జాకెట్లు లేనిచో టూరిస్టులకు బోట్లు అనుమతించరాదు**

**మొరబూట్ల యజమానులు నిబంధనలో పాటించాలి**

**అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం**

**జిల్లా పర్యటక శాఖ అధికారి కలవరాల నరసింహ**



**కొల్లాపూర్ ఏప్రిల్ 3 ప్రజా జ్యోతి** సంగమేశ్వరం వెళ్లే టూరిస్ట్ లు తప్పకుండ లైఫ్ జాకెట్లు ధరించాలిలైఫ్ జాకెట్లు లేని టూరిస్ట్ లను బోట్లలో అనుమతించవద్దు.మర బోట్ల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ.తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం మండల పరిధిలో ఉన్న సోమశిల నుంచి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న సంగమేశ్వరం కు పర్యాటకుల రద్దీ పెరగడంతో జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మరియు గ్రామ సర్పంచ్ కాటం వెంకటలక్ష్మి వెంకటస్వామి గార్లు బోట్లను సందర్శించారు. లైఫ్ జాకెట్లు లేకుండా టూరిస్ట్ లు ప్రయాణించడంతో ప్రతి ఒక్క టూరిస్ట్ లు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలని లైఫ్ జాకెట్లు ధరించని టూరిస్ట్ లను బోట్ల లో ఎక్కించవద్దని వారు టూరిస్ట్ పోలీస్ లను

ఆదేశించారు.బోట్ల యజమానులు లైఫ్ జాకెట్లు టూరిస్ట్ లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని, బోట్ల లో స్థాయికి మించి ఎక్కువ మంది టూరిస్ట్ లను ఎక్కించవద్దు అని నిబంధనలు అతిక్రమిస్తే బోట్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ తెలియజేశారు.కార్యక్రమంలో టూరిస్ట్ కానిస్టేబుల్ శివ శంకర్, శివ ప్రసాద్ ఉన్నారు

# నేటి నుంచి మీ సేవలు బంద్

**కొల్లాపూర్ ఏప్రిల్ 3 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్రంలోకొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో శుక్రవారం రాత్రి నుంచి అన్ని సేవలు నిలిచిపోనున్నాయి. షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ కోసం ఈ తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందని మీసేవ నిర్వాహకులు తెలిపారు. కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కావడానికి 36 గంటల సమయం పట్టనుంది. శనివారం, ఆదివారం సెలవులు కావడంతో, మీసేవలు సోమవారం ఉదయం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని నిర్వాహకులు ప్రజలకు సూచించారు

# మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ

**బియ్యం పంపిణీ ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కేజీల చొప్పున**

**మూడు నెలలకు కలిపి ఒకేసారి మొత్తం 18 కేజీల బియ్యం పంపిణీ**

**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా సంక్షేమం**

**సింగోటం గ్రామం బిజెపి పార్టీ డిప్యూటీ సర్పంచ్ తమటం సాయికృష్ణ గౌడ్**

**కొల్లాపూర్ ఏప్రిల్ 3 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ నియోజక వర్గంలో ఉన్న ఐదు మండలాల గ్రామాలలో రేషన్ షాపులకు ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు గ్రామాలలో బియ్యం పంపిణీ,ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొల్లాపూర్ మండల పరిధిలో ఉన్న సింగోటం గ్రామంలో బీజేపీ పార్టీ డిప్యూటీ సర్పంచ్ తమటం సాయి కృష్ణ గౌడ్ నివాసంలో ప్రజా జ్యోతి పత్రిక ఇంటర్వ్యూలో ముఖాముఖి.వేసవి తాపం దృష్ట్యా మీరు పదేపదే గ్రామాలలో రేషన్ షాపుల వద్ద క్యూ కట్టే ఇబ్బంది లేకుండా ఉండాలని, ఏప్రిల్, మే, జూన్, నెలలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి గ్రామాలలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించడం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం సహకారం లేకుండా గ్రామాలలో ప్రజల వద్దకు రేషన్ బియ్యం చేరుకోవాలని కేంద్ర ప్రభుత్వము తీసుకున్న నిర్ణయాలు.బియ్యం పంపిణీ: ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కేజీల చొప్పున, మూడు నెలలకు కలిపి ఒకేసారి మొత్తం 18 కేజీల



బియ్యంపంపిణీ.అంత్యోదయ కార్డుదారులు: అంత్యోదయ కార్డు ఉన్న కుటుంబాలకు నెలకు 35 కేజీల చొప్పున, మూడు నెలలకు కలిపి మొత్తం 105 కేజీల రేషన్ అందజేయబడుతుంది.

ఇతర వస్తువులు: బియ్యంతో పాటు ఆయా నెలలకు కేటాయించిన ఇతర నిత్యావసర వస్తువులను కూడా నేటి నుంచే పొందే వీలుంటుంది.గత వర్షాకాలంలో కూడా ప్రజల సౌకర్యార్థం ఇలాగే మూడు నెలల రేషన్‌ను ఒకేసారి కేంద్ర ప్రభుత్వం అందించింది.ఎండలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి, సాధ్యమైనంత వరకు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో రేషన్ షాపులకు వెళ్లి మీ కోటాను సేకరించుకోవాలని కోరుతున్నాను. కార్యక్రమంలో బిజెపి పార్టీ నేతలు శేఖర్ రావు. రమేష్. కురుమూర్తి. తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట రూరల్ ఎస్సైగా ఎస్ సతీష్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఎస్ సతీష్ రెడ్డి ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన, బదిలీపై నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.ఇప్పటివరకు రూరల్ ఎస్సైగా పనిచేసిన రాముడు నారాయణపేట జిల్లా వీఆర్‌కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతన ఎస్‌హెచ్‌ఓ ఎస్ సతీష్ రెడ్డి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖ్రూలా గారిని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పూల మొక్క అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన ఎస్‌హెచ్‌ఓకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండల పరిధిలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. నేర నియంత్రణలో చురుకుగా



వ్యవహరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ గారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్ సతీష్ రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు.

# క్యాన్సర్‌పై ముందస్తు జాగ్రత్తలే ప్రాణరక్షణ

**- మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

**- సమయానికి పరీక్షలు చేయించుకోవాలని నిపుణుల సూచన**

**-- గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తరణ**

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి బ్యూరో): క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, నిరంతరం పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని సూచించారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా ఈ వ్యాధిని దూరం పెట్టవచ్చని తెలిపారు. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్ వంటి సమస్యలు మహిళల్లో అధికంగా కనిపిస్తున్నాయని, వీటిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని వెల్లడించారు.

ఈ క్రమంలో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు "డిస్కవర్ హెల్త్" సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తూ, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా ముందస్తు గుర్తింపుకు చర్యలు చేపడుతున్నారు. యోగా, ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం, పొగాకు మరియు మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే హెచ్ పి వి వంటి వైరస్‌ల నుంచి రక్షణ పొందేందుకు వ్యాక్సినేషన్ కూడా కీలకమని పేర్కొన్నారు.

అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆలస్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుని కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

అత్యవసర సేవల కోసం యోగా హాస్పిటల్స్‌ను సంప్రదించవచ్చని, అలాగే హెల్ప్‌లైన్ నంబర్ 091 91549 95462 ద్వారా అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వేలాది మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు.




## క్రీడల్లో రాణిస్తే విశ్వ విజేతలు అవుతారు

### ప్రిన్సిపల్ బాలస్వామి






**అచ్చంపేట ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే విశ్వ విజేతలుగా గుర్తింపు పొందుతారని కళాశాల ప్రిన్సిపాల్ బాలస్వామి అన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు శుక్రవారం ఉదయం అచ్చంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాల మైదానంలో నిర్వహించబడ్డాయి. 150 మంది విద్యార్థులు పాల్గొనగా అందుల 30 మంది వివిధ విభాగాల్లో క్రీడాకారులు ఎంపికయ్యారని నాగర్ కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలా పోగుల స్వాములు పేర్కొన్నారు. ఈరోజు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11 మరియు 12 తేదీలలో హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరగబోయే తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ కప్ అండర్-20 బాల బాలికలు, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొంటారని స్పష్టం చేశారు. అంతకుముందు అథ్లెటిక్స్ ఎంపికల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా స్థానిక గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ బాలస్వామి హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకుని జెండా ఊపి ఎంపికలను ప్రారంభించారు. అనంతరం ఆయ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. క్రీడలు విద్యార్థులకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, స్నేహ సంబంధాలను పెంపొందించడంతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తాయని పేర్కొన్నారు...విద్యార్థులు పాఠశాల దశ నుంచే క్రీడల్లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ, అంచెలంచెలుగా ఎదిగి విశ్వ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వారు సాధించే ప్రశంసా పత్రాలు, మెడల్స్ వారి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో స్పోర్ట్స్ కోటా కూడా ఉంటుందని తెలియజేశారు. పోటీల్లో ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా మరింత కష్టపడి సాధన చేస్తే తమ లక్ష్యాలను సాధించి సమాజంలో మంచి గుర్తింపు పొందగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, ఫిజికల్ డైరెక్టర్ బాలయ్య, వాలీబాల్ కోచ్ శివ, పీఈటీలు జ్యోతి, రాజేందర్, మల్లేష్, దాసరి అంజయ్య, నిరంజనమ్మ, కృష్ణవేణి, పద్మజతో పాటు క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారికి పాల ఊట్లు

కృష్ణ ప్రజా జ్యోతి 3/ఏప్రిల్/2026/ కృష్ణ మండల పరిధిలోని గుండెబల్లూర్ గ్రామంలోనీ శ్రీశ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పాల ఊట్ల కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఉదయం వేళల్లోనే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. పూజారులు వేద మంత్రాలతో మధ్య స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు తమ తమ కుటుంబ సమేతంగా పాల ఊట్లు సందర్శించారు స్వామివారి ఆశీస్సులు పొందారు.



# కెసిఆర్ అనవాళ్లను చెరిపేసే ప్రయత్నాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది





## తెలంగాణ మాజీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కెసిఆర్ మనవాళ్లను చెప్పేయాలని చూస్తున్నారు అని తీవ్రంగా మండిపడ్డారు తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి ఆయాన్ ను పరామర్శిస్తూ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఆయన్ అనే విద్యార్థి మీద కాంట్రాక్ట్ బేసిక్ మీద చదువు చెప్పకు ఉపాధ్యాయుడు కారణంగా కొట్టి తీవ్రంగా గాయపడిన సంఘటన తీవ్రంగా కలకాలం లేపుతుంది, ఇప్పటికీ జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే ఎవరు స్పందించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు, గురుకులాల్లోనీరు పేద మైనారిటీ విద్యార్థులు చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని లక్ష్యంతో టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్థాపించిన గురుకులాలను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆన వాళ్లను చెరిపేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు, ఒకపక్క గురుకులాల్లో ఫుడ్ ఫైసింగ్, మరోపక్క ఇలాంటి టీచర్లు విద్యార్థులను అకారణంగా కొట్టి హాస్టల్ నుంచి వెళ్లిపోయే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు, దాంతో మైనారిటీ గురుకులాలను మూసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు, ఇలాంటి ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే ఆయన హెచ్చరించారు, క్వాలిఫికేషన్ లేకుండా వారికి కావాల్సిన వారినే గురుకులాల్లో ఉపాధ్యాయులుగా నియమించుకొని విద్యను వ్యాపారంగా మార్చడం జరిగిందన్నారు , విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు, అలాగే ఈ విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు మీద ఇప్పటిదాకా జిల్లా కలెక్టర్ కానీ జిల్లా మైనార్టీ కి సంబంధించిన అధికారులు ఎవరూ పూర్తిస్థాయిలో విచారణ చేయలేదని ఈ విషయం మీద పూర్తి విచారణ చేసి బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థుల తరఫున పోరాటాన్ని చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మహమ్మద్ దానేష్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జడ్చర్ల, సయ్యద్ ఆరిఫ్ ఖాద్రి మండల మైనారిటీ అధ్యక్షులు, మహమూద్ అన్సారీ మైనారిటీ టౌన్ అధ్యక్షులు, అన్వర్, రహీం, ఇంతియాజ్, ఫహీం,అబుల్ సలీం అడ్వకేట్ సీనియర్ నాయకులు,తాజుద్దీన్ టింగలీ, ఫిరోజ్,చాంద్ పాషా, జాకీర్ హజారి, ఇర్ఫాన్ తౌసిఫ్,ఖిజార్, వహీద్ మరియు తదితరులు పాల్గొన్నారు

# తేజశ్రీ తల్లిదండ్రులకు పరామర్శ



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 03( ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం పసి రెడి గ్రామంలో సంచలనం సృష్టించిన చిన్నారి తేజశ్రీ తల్లిదండ్రులను పరామర్శించడం జరిగింది. చేయూత స్వచ్ఛంద సంస్థ బృందం, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి ఘాతకానికి పాల్పడ్డ నిందితులను శిక్షించాలని ఎంతటి వారైనా సరే చట్టం ముందు నిలబెట్టాలని వారు ప్రభుత్వాన్ని పోలీసులను డిమాండ్ చేశారు, అలాగే స్వచ్ఛంద సంస్థ తరఫున మీకు ఎల్లవేళలా మద్దతు ఉంటుందని మీకు ఏ కష్టం వచ్చినా మేము ఉంటామని మీ తరఫున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి ధైర్యాన్ని ఇచ్చారు, ఇప్పటికే 48 గంటలు గడిచిపోతున్న నిందితున్ని పట్టుకోవడంలో జాప్యం జరగడం తీవ్ర అన్యాయమని, ఒకవేళ ఇంకొక్క 24 గంటల్లో నిందితులను పట్టికోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని , ప్రభుత్వం తేజశ్రీ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు, ఏదేమైనా ఒక అభం శుభం తెలియని చిన్నారిని చంపిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఇలాంటి నేరాలు మరి ఎవరు చేయని విధంగా కఠిన శిక్షలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని పోలీసులను వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ మరియు ప్రధాన కార్యదర్శి మాధవ్ మరియు కుల నిర్మాణ పోరాట సమితి నర్సింలు మరియు చేయూత స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు సోఫీ పాల్గొన్నారు

# దొడ్డి కొమురయ్య జయంతి

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రజలు నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ కొనియాడారు. శుక్రవారం ఐడీఓసీ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన కొమురయ్య త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు, ఇతరులు పాల్గొన్నారు.



# సలేశ్వరం జాతరను మరో రెండు రోజులు పొడగించాలి

## మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య

**కల్వకుర్తి, ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి):**

అమరనాథ్ యాత్రగా పిలువ బడే అత్యంత మహిమాన్విత క్షేత్రమైన మరో అమరనాథ్ యాత్రగా పిలవబడే సలేశ్వరం జాతరను మరో రెండు రోజులు పొడగించాలని జిల్లెల్ల మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని శు క్రవారం పత్రిక మఖంగా కోరారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు,తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శణార్థం వస్తుంటారని అన్నారు.. భక్తుల రద్దీ ఎక్కువ కావడం, రోజులు తక్కువ ఉండడంతో స్వామివారిని దర్శంచుకోలేక, వెనుదిరుగుతున్నారన్నారు. మూగజీవాలకు, పర్యావరణ ప్రకృతికి విఘాతం కలుగకుండ అందరు భక్తులు దర్శించుకునేలా చూ డాలని, అలాగే ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వచ్చిన భక్తులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం బాదకరమని, గతంలో కూడా శ్రీశైలం పుణ్యక్షేత్రంలో, కేరళలోని అయ్యప్పస్వామి క్షేత్రంలో భక్తులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం బాధాకరమన్నారు. భక్తులకు సరైన వసతులు కల్పించి, వారికి ఇబ్బందులు కలుగకుండ అద్యాత్మికతను అందించే బాధ్యత ప్రభుత్వాని దేనని, భక్తులు కంట్రోల్ కావడం లేదని లాఠీచార్చి చేయడం ఎంటని ప్రశ్నించారు. గతంలో ఈ యాత్ర 9 రోజులు, ఆ తర్వాత 5 రోజులు, ఇప్పుడు 3 రోజులకు కుదించడం భక్తుల మనోభావాలకు ఇబ్బందులు కలిగించడమేనని అన్నారు. అలాగే ఫారెస్టు అధికారులు ఒక్కో వాహనం నుండి 500 రూపాయలు టోల్ ఫీజు వసూళ్లు చేశారని, భక్తుల దగ్గర ఒక్కొక్కరికి 30 రూపాయలు వసూలు చేశారని, కానీ సౌకార్యాలు మాత్రం గతంలో మాదిరిగానే ఉన్నాయని. అభివృద్ధి లేదన్నారు. ఆలయాల దగ్గర భక్తుల మనోభావాలకు ఇబ్బం దులు కలిగిస్తే చూస్తు ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని సలేశ్వరం జతరను మరో రెండు రోజులు పొడిగించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆయన పత్రిక ముఖంగా కోరారు.



# ఏసుప్రభువు ప్రబోధించిన శాంతి క్షమాపణ సనార్గం వంటి

**ఉన్నత బోధనలు సమస్త మానవజాతి అనుసరించాలని**
**గుడ్ ఫ్రైడే రోజు సమస్త ప్రజలు ఈపండుగను జరుపుకుంటారు**
**రత్నగిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అధ్యక్షులు**
**జూపల్లి యువ నాయకులు అరుణ్.**

**కొల్లాపూర్ ఏప్రిల్ 3 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ నియోజక వర్గంలో ఉన్న ఐదు మండలాల గ్రామాల ప్రజలు గుడ్ ఫ్రైడే రోజులు అంగరంగ వైభోగంగా జరుపుకుంటున్న క్రైస్తవులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రత్నగిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అధ్యక్షులు యువ నాయకులు జూపల్లి అరుణ్, కొల్లాపూర్ నియోజక వర్గంలో ఉన్న గ్రామాలలో అన్ని చర్చిల దగ్గర క్రైస్తవులు ప్రార్థనలు చేస్తున్న వారి కుటుంబాలు ప్రజలు చల్లగా ఉండాలని ఏసుప్రభువును ప్రార్థిస్తున్నా జూపల్లి అరుణ్,భారతదేశంలోని చాలామంది క్రైస్తవులు గుడ్డు ఫ్రైడే రోజున ప్రత్యేక చర్చిల దగ్గరికి వెళ్లి కార్యక్రమాలకు క్రైస్తవులు హాజరవుతారు లేదా వారి ఇళ్లల్లో ప్రార్థనలు చేస్తారు కొందరు, గుడ్ ఫ్రైడే రోజున ఉపవాసం ఎక్కువమంది ఉంటారు అలాంటి రోజు మళ్లీ సంవత్సరానికి వస్తుందని చాలా భక్తిశ్రద్ధలతో ప్రజలు ప్రార్థనలు చేస్తారు. యేసయ్య జీవితంలో చివరి రోజు కాబట్టి చర్చలు క్రైస్తవులు ప్రార్థనలు చేసే విధంగా గ్రామాలలో జరుపుకుంటారు, గుడ్ ఫ్రైడే ఒక విషాదకరమైన రోజు ఆ రోజు చర్చిలు ఖాళీగా చీకటిగా ఉంటాయి ప్రార్థనలు మధ్యాహ్నం వరకే చర్చిలలో ప్రార్థనలు క్రైస్తవులు ముగిస్తారు. కొన్ని గ్రామాల చర్చిల్లో ఆకులు వెనిగర్ మరియు ఇతర పదార్థాలతో తయారు చేసిన ఒక చేదు పానీయం ఉంటుంది ప్రార్థన తర్వాత ఆ పానీయాన్ని అందరూ రుచి చూస్తారు ఇది క్రైస్తవుల ఆచారం.ఏసుప్రభువుకు సిలువ వేసిన రోజున మరణాన్ని స్మరించుకునే రోజు గుడ్ ఫ్రైడే రోజు గా భావిస్తారు ఇది క్రైస్తవ మతంలో ఒక ముఖ్యమైన సంఘటన. ఇది యేసు జీవితంలోని త్యాగాలను మరియు బాధలను చూసింది పవిత్ర వారంలోని అనేక సంఘటనలకు సిలువ వేయబడటం పరకష్టంగా నిలిచింది. వాటిలో పామ్ సండే నాడు యేసు జేరుసాలెంకు విజయవంతంగా తిరిగి రావడం రోజు కాబట్టి అందరూ పండుగగా జరుపుకుంటారు.సమస్త మానవాళి పాప పరిహారం కోసం జీసస్ చేసిన మహాత్యాగానికి గుర్తు గుడ్ ఫ్రైడే తోటి మనిషి పట్ల ప్రేమ ఆకాశమంతటి సహా నం అవధులు లేని త్యాగం ఇదే యేసు జీవితం మానవాళికి ఇచ్చిన సందేశం. చెడుపై గెలవాలంటే మంచే ఆయుధమని శాంతి సహనంతో మనిషి మనుగడ సాగాలని క్రీస్తు బోధనలు సదా అనుసారానియం మనవాళ్ళ కోసం ప్రభువు త్యాగం చేసిన రోజును గుడ్ ఫ్రైడే సందర్భంగా జరుపుకుంటారు. మానవ పాప ప్రక్షాళనకై సిలువ నెక్కిన ఏసుప్రభు ప్రబోధించిన శాంతి క్షమాపణ సనార్గం వంటి ఉన్నత బోధనలు సమస్త మానవజాతి అనుసరించాలని గుడ్ ఫ్రైడే రోజును సమస్త ప్రజలు పండగగా జరుపుకుంటారు,





# గండీడ్ మండల బిజెపి శిక్షణ తరగతులు



## - మొదటి రోజు విజయవంతం

**గండిడ్ ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)**

"పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్" లో భాగంగా గండీడ్ మండల కేంద్రంలోని విశ్వభారతి కళాశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి శిక్షణ తరగతులు మండలాధ్యక్షులు కె విజయ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కార్యక్రమం ప్రారంభంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, భారత్ మాతా కీ జై నినాదాలతో శిక్షణ శిబిరాన్ని వైభవంగా ప్రారంభించడం జరిగింది.

అనంతరం శిక్షణకు హాజరైన కార్యకర్తలందరికీ క్రమపద్ధతిలో సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. తర్వాత మొదటి రోజు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం రెండు ముఖ్యమైన శిక్షణ తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయి. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై వక్తలు దిశానిర్దేశం చేశారు.

**పాల్గొన్న ముఖ్య నాయకులు:-**

రాష్ట్ర నాయకులు గిరిమోని శ్రీనివాస్,ఏవి రాములు ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్ , మండల ప్రధాన కార్యదర్శులు రాజు మల్కయ్య సల్కర్ పేట్ గ్రామ సర్పంచ్ హేమలత పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షులు భద్రేశ్వర్, కోశాధికారి శ్రీనివాసులు, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు రాజేశ్వరి,దీజీవీ మండల అధ్యక్షులు యాదగిరి,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రాములు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రఘు, కార్యదర్శి నరేష్ , మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ వనపల్లి నవీన్ మరియు మండల పదాధికారులు, బూత్ అధ్యక్షులు, దీూాలు మరియు పార్టీ ముఖ్య నాయకులు, క్రియాశీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ వ్యవస్థను భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్ కాదా..!

## - పంచాయతీలను అప్పుల ఊబిలోకి నెట్టింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం..

## - ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్: కాంగ్రెస్ నేతల మండిపాటు

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి): గ్రామ స్వరాజ్యం, గ్రామ వ్యవస్థ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేసిందని, గ్రామ వ్యవస్థను భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్ పార్టీయేనని కాంగ్రెస్ జిల్లా నాయకులు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, గంధం శరవంద, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ సాగర్, జిల్లా కార్యదర్శి బి.కృష్ణ లు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, గ్రామపంచాయతీలకు రూ.20 లక్షల నిధులు ఇస్తామని ప్రకటించి క్షేత్రస్థాయిలో బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచులు అప్పుల్లో కూరుకుపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. పత్రికల్లో సర్పంచ్ కుటుంబాలు ఇబ్బందులు పడిన ఘటనలు వెలుగుచూసిన విషయాన్ని గుర్తు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను మళ్లించి, సర్పంచులను అప్పుల పాల్జేసి గ్రామ వ్యవస్థను దెబ్బతీశారని ఆరోపించారు. వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములను ఆక్రమించిన ఘటనలు ఉన్నాయా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారని, రూ.8 లక్షల కోట్ల అప్పుతో తెలంగాణను సంక్షోభంలోకి నెట్టిందీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించడం వాస్తవం కాదా అని




ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అలాంటి పార్టీని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. రైతులను రాజులుగా నిలబెట్టిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలను గుర్తుచేస్తూ, రైతులకు ఉచిత విద్యుత్ అందించిన తొలి నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో యువత క్రీడలకు, విద్యార్థులు చదువులకు దూరమయ్యారని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల కంటే మెరుగైన కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు మంచి పనులను విస్మరించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలను మానుకుని ప్రజలకు మేలు చేసే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని హితవు పలికారు.

# వృషభరాజుల బల ప్రదర్శనలో ఎంవీఎస్ఆర్ బుల్స్‌కు మొదటి బహుమతి



**వడ్డేపల్లి ఏప్రిల్ 03(ప్రజా జ్యోతి):**

వడ్డేపల్లి మండలం, కొంకల గ్రామంలో శ్రీశ్రీశ్రీ నీలకంటేశ్వర స్వామి కళ్యాణం,రథోత్సవ జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వృషభరాజుల బల ప్రదర్శన పోటీల్లో ఎంవీఎస్ఆర్ బుల్స్ విజయం సాధించింది. మార్థాల వెంకట సుబ్బారెడ్డి (రంగసాయిపల్లి,వైఎస్ఆర్ కడప జిల్లా)కి చెందిన ఎంవీఎస్ఆర్ బుల్స్‌కు మొదటి బహుమతిగా రూ.60,000 నగదు ప్రదానం చేసినట్లు రెడ్ల కమిటీ సంఘం సభ్యులు తెలిపారు. విజేతలకు రెడ్ల సంఘం సభ్యులు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ ఆలయ మాజీ చైర్మన్ బి.నాగేశ్వర్ రెడ్డి, సూర్య ప్రతాప్ రెడ్డి,కొంకల సర్పంచ్ జ్యోతి వరద రాజు,ఉప సర్పంచ్ సంజీవ,బంగారు మహేశ్వర్ రెడ్డి,కె.క్రిష్టారెడ్డి,మస్కా శరవణ,ఆంజనేయులు గౌడ్,గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇంట్లో పేకాట... 8 మంది అరెస్ట్

**వనపర్తి, ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి):**

వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామ శివారులోని డబుల్ బెడ్రూం గృహంలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... బ్లాక్ నం.31లోని రూమ్ నం.202లో కొందరు వ్యక్తులు పేకాట (అందర్ బహార్) ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ హృషీకేష్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. ఈ సందర్భంగా ఎం.డి. అహ్మద్ (28), శివగవుని నాగరాజు, ఎర్ర రజిని బాబు, గొల్ల రాముడు, డేగ మాణిక్ రెడ్డి, బోకోళ్ల కేశవులు, కోటి రెడ్డి తదితరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.36,030 నగదు, 8 స్మార్ట్ ఫోన్లు, 5 బైకులు, 104 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ హృషీకేష్ వెల్లడించారు.

# చందాపూర్‌లో బాల్య వివాహం అడ్డగింత.. కేసు నమోదు

వనపర్తి, ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి) చందాపూర్ గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఐసిడిఎస్ అధికారి భారతి తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం చందాపూర్ గ్రామానికి వెళ్లి వివాహాన్ని నిలిపివేశారు. ఈ ఘటనపై అమ్మాయి తల్లిదండ్రులు, వరుడు, అతని తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రిషికేశ్ కేసు నమోదు చేశారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఇటువంటి ఘటనలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# "అంజన్న చెంతన ..జయంతి ఉత్సవాలు"

## - మద్దిమడుగు ఆలయంలో ప్రత్యేక పూజలు గావించిన

## - జిబిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ గువ్వల అమలు

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 3( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగు గ్రామంలో స్వయంభుగా వెలిసిన.. శ్రీ ప్రబ్బతి ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం బిజెపి శ్రేణులతో కలిసి ఆలయం వద్ద సందర్శించి, ప్రత్యేక పూజలు గువ్వల అమల గావించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ సతీమణి అమలకు అర్చకులు సత్కరించారు. ఈ సందర్భంగా గువ్వల గువ్వల అమల మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయం వద్ద సందర్శించి, పూజలు గావించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు మద్దిమడుగు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ, అచ్చంపేట పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బిజెపి మహిళా నాయకురాలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



